గిద్దలూరులో చైన్ స్నాచింగ్

గిద్దలూరు రూరల్: మహిళ మెడలో బంగారు గొలుసును గుర్తు తెలియని దుండగుడు లాక్కెళ్లిన సంఘటన గిద్దలూరు నగర పంచాయతీ పరిధిలోని సంద్యాలరోడ్డులో గల జగనన్న కాలనీ వద్ద ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. రోడ్డు పక్కన చిరువ్యాపారం చేసుకుంటూ జీవిస్తున్న నారాయణమ్మ అనే మహిళ వద్దకు ఓ గుర్తు తెలియని వ్యక్తి వచ్చాడు. వస్తువులు కొనుగోలు చేసిన సదరు దుండగుడు ఆమెతో మాటలు కలిపి హఠాత్తుగా మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కుని బైక్‌పై పారిపోయాడు. బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేపట్టారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

● రూ.5 లక్షలకు పైగా నష్టం


కాలిపోతున్న పొగాకు బ్యారన్

వెలిగండ్ల(కనిగిరిరూరల్): ప్రమాదవశాత్తు పొగాకు బ్యారన్ దగ్ధమైన సంఘటన సోమవారం తెల్లవారుజామున వెలిగండ్ల మండలంలోని పాపిరెడ్డిపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన రైతు మారం వెంకట సుబ్బారెడ్డి బ్యారన్‌లో పొగాకు క్యూరింగ్ చేస్తున్నారు. ఈ క్రమంలో పొగాకు అల్లిక కర్ర జారి మొద్దు గొట్టంపై పడటంతో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖ అధికారి బంగారు బాబు తన సిబ్బందితో వచ్చి మంటలు అదుపుచేశారు. అయితే అప్పటికి బ్యారన్‌లో ఆకు, కర్ర, టైర్లు తదితర సామగ్రి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. రూ.5 లక్షలకు పైగా నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు వెంకట సుబ్బారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

లారీని ఢీకొని యువకుడు దుర్మరణం



ప్రమాదంలో మృతి చెందిన మోహన్‌వంశీకృష్ణ (ఇన్‌సెట్)మోహన్ వంశీ కృష్ణ(ఫైల్)



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై శివ (ఇన్‌సెట్) మృతుడు వేమా నాగార్జున(ఫైల్)

సింగరాయకొండ: జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న లారీని వెనుక నుంచి బైక్ ఢీకొట్టడంతో ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన సింగరాయకొండలోని కలికవాయ ఫ్లయ్‌ఓవర్ దిగువన ఆదివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మండల కేంద్రంలోని బాలయోగినగర్‌కు చెందిన కూరపాటి మోహన్ వంశీకృష్ణ(23) కందుకూరులోని వివేకానంద కాలేజీలో డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్నాడు. ఖాళీ సమయంలో కె.బిట్రగుంట వద్ద గల పాల ఫ్యాక్టరీలో షిఫ్ట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి పాల ఫ్యాక్టరీకి బైక్‌పై బయలుదేరాడు. ఈ క్రమంలో కలికవాయ ఫ్లయ్‌ఓవర్ దిగువనఆగి ఉన్న లారీని వెనుక నుంచి వంశీ ఢీకొట్టాడు. పంక్చరైన టైరు మార్చుకునేందుకు రోడ్డు మార్జిన్‌లో లారీని నిలపగా వేగంగా వెళ్తున్న క్రమంలో వంశీ గమనించకపోవడంతో ప్రమాదం సంభవించినట్లు స్థానికులు చెబుతున్నారు. మృతుడి తండ్రి వెంకటేశ్వర్లు లారీ డ్రైవర్‌గా, తల్లి నాగమణి స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లి రోదిస్తున్న తీరు చూపరులను కలిచివేసింది. టంగుటూరు హైవే మొబైల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి.మహేంద్ర తెలిపారు.

బైక్ అదుపుతప్పి మరో యువకుడు..

కురిచేడు: ద్విచక్రవాహనం అదుపు తప్పి ఓ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన కురిచేడు మండలంలోని బోదనంపాడు సమీపంలో బందిళ్ల బావి వద్ద సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై ఎం.శివ కథనం ప్రకారం.. బోదనంపాడు గ్రామానికి చెందిన వేమా నాగార్జున(32) వ్యక్తిగత పని నిమిత్తం తన బైక్‌పై దర్శికి బయలుదేరాడు. గ్రామ శివారులోని బందిళ్ల బావి వద్ద బైక్ అదుపు తప్పి పొలాల్లోకి దూసుకెళ్లి హద్దురాయిని ఢీకొట్టాడు. దీంతో నాగార్జున తలకు బలమైన గాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ఎస్సై పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతునికి భార్య ఉంది. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై ఏకాగ్రత

కలెక్టర్ తమీమ్ అన్సారియా


విద్యార్థినితో ఆల్బెండజోల్ మింగిస్తున్న కలెక్టర్

ఒంగోలు సిటీ: విద్యార్థులు ఆరోగ్యంగా ఉన్నపుడే చదువుపై ఏకాగ్రత సాధ్యమని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. బాలబాలికలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. సోమవారం జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఒంగోలులోని జవహర్ నవోదయ విద్యాలయలో చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఆరు నెలలకోసారి విద్యార్థులతో ఆల్బెండజోల్ మాత్రలు మింగిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో 19 ఏళ్ల లోపు విద్యార్థులు 5,96,751 మంది ఉండగా 6,80,000 మాత్రలు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. భోజనానికి ముందు, కాలకృత్యాల తర్వాత చేతులు సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. చేతుల శుభ్రత విధానంపై అవగాహన కల్పించారు. అనివార్య కారణాలతో సోమవారం ఆల్బెండజోల్ మాత్రలు మింగని విద్యార్థులకు ఈ నెల 17వ తేదీన మాత్రలు పంపిణీ చేయనున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు తెలిపారు. కార్యక్రమంలో మేయర్ సుజాత, ఆర్‌ఐఓ సైమన్ విక్టర్, డీఈఓ కిరణ్‌కుమార్, ప్రిన్సిపాల్ గీతాలక్ష్మి, వైద్యులు పద్మజ, వాణిశ్రీ, ఖాశిం, ప్రీతమ్ పాల్గొన్నారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 69 ఫిర్యాదులు

ఒంగోలు సబర్బన్: బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్పీ ఏఆర్ దామోదర్ పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన పబ్లిక్ గ్రీవెన్స్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా 69 మంది బాధితులు ఎస్పీ ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. ఒంగోలు నగర శివారులోని కార్గిల్ పెట్రోల్ బంకు ఎదురుగా నూతనంగా నిర్మిస్తున్న వైద్యశాలకు ఆనుకుని ఉన్న తమ ప్లాట్లను కొందరు తమవి అంటూ బెదిరిస్తున్నారని రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగి పలగాని రామసుబ్బారెడ్డి ఫిర్యాదు చేశారు. కొంతమంది రిటైర్డ్ ఉద్యోగులం కలిసి ప్లాట్లు కొనుగోలు చేయగా అమ్మిన వ్యక్తి డబుల్ రిజిస్ట్రేషన్లు చేసి వేధిస్తున్నాడని వాపోయారు. 30 శాతం ఆదాయం వస్తుందని ఓ యాప్ ద్వారా ఆశ చూపి విడతలవారీగా రూ.11.80 లక్షలు తీసుకుని మోసం చేశారని ఒంగోలు బాలాజీ నగర్‌కు చెందిన వ్యక్తి వాపోయాడు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. చట్ట పరిధిలో త్వరితగతిన సమస్యలు పరిష్కరిస్తామని బాధితులకు హామీ ఇచ్చారు. సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. కాగా ఫిర్యాదుల్లో కుటుంబ కలహాలు, భర్త–అత్తారింటి వేధింపులు, చీటింగ్, ఉద్యోగాల పేరుతో మోసం, భూ వివాదాలే అధికంగా ఉన్నాయి.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు మార్కాపురం వాసి ఎంపిక


పతకాలతో రజనీష్

మార్కాపురం: అనంతపురంలో ఈనెల 9, 10 తేదీల్లో నిర్వహించిన రాష్ట్ర స్థాయి 43వ మాస్టర్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో మార్కాపురం పట్టణానికి చెందిన క్రీడాకారుడు, పీఈటీ ఎస్.రజనీష్ పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. స్థానిక కమలా హైస్కూల్లో పీఈటీగా పనిచేస్తున్న రజనీష్ 35 ఏళ్ల వయసు విభాగంలో 100 మీటర్ల రన్నింగ్, హైజంప్‌లో గోల్డ్ మెడల్స్ సాధించారు. మార్చి 4 నుంచి 9వ తేదీ వరకు బెంగళూరులో నిర్వహించనున్న జాతీయ స్థాయి అథ్లెటిక్స్‌కు ఎంపికైన రజనీష్‌ను జిల్లా మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రటరీ శివశంకర్, కమలా విద్యా సంస్థల కరస్పాండెంట్ పవన్‌కుమార్, అకడమిక్ డైరెక్టర్ సింధూజ, ప్రిన్సిపాల్ డాక్టర్ స్వరూప్ రంజన్ అభినందించారు.

గ్యాస్ సిలిండర్ పేలి పూరి గుడిసె దగ్ధం


కాలిపోయిన పూరిగుడిసె

అర్ధవీడు: గ్యాస్ సిలిండర్ పేలి పూరి గుడిసె దగ్ధమైన సంఘటన సోమవారం అర్ధవీడు మండలంలోని పాపినేనిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామంలో నివాసం ఉంటున్న మరియమ్మ వ్యక్తిగత పనిపై రంగాపురం వెళ్లింది. ఈ సమయంలో పూరి గుడిసెలో ఉన్న సిలిండర్ ఒక్కసారిగా పేలడంతో ఇంట్లో ఉన్న సుమారు రూ.2 లక్షల విలువైన సామగ్రి, సరుకులు దగ్ధమైపోయాయి. ప్రమాద సమయంలో ఎవరూ లేక పోవడంతో ప్రాణ నష్టం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పివేశారు.

'వెలుగొండ'కు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

● సీపీఎం నాయకుల డిమాండ్



మాట్లాడుతున్న షేక్ మాబు

మార్కాపురం: వెలుగొండ ప్రాజెక్టుకు త్వరలో ప్రవేశపెట్టనున్న రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2 వేల కోట్లు కేటాయించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా పరిధిలోని 23 మండలాల సీపీఎం నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని స్థానిక ఎన్‌జీఓ హోమ్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు దగ్గుపాటి సోమయ్య అధ్యక్షతన నిర్వహించారు. కనిగిరి, దర్శి, యర్రగొండపాలెం, గిద్దలూరు, మార్కాపురం నియోజకవర్గ కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ.. వెనుకబడిన పశ్చిమ ప్రకాశం ప్రజల చిరకాల కోరికైన వెలుగొండ ప్రాజెక్టుకు నిధులు కేటాయించి ప్రజలకు అందుబాటులోకి తేవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అత్యంత తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు చేకూర్చే ఏకైక ప్రాజెక్టు వెలుగొండ మాత్రమేనన్నారు. మొదటి సొరంగం పనులు పూర్తయ్యాయని ఫీడర్ కెనాల్‌కు మరమ్మతులు చేసినట్లయితే ప్రాజెక్టులోకి నీరు చేరుతుందన్నారు. నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ ఇస్తే ముంపు గ్రామాలు ఖాళీ అవుతాయన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేని కారణంగానే ప్రాజెక్టును చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. ప్రాజెక్టును వేగంగా వినియోగంలోకి తీసుకురాకుంటే సీపీఎం, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జీవీ కొండారెడ్డి మాట్లాడుతూ.. వెలుగొండ ప్రాజెక్టుకు సంబంధించి మైనర్, మేజర్ కెనాల్స్ పూర్తయ్యాయని, బడ్జెట్‌లో తగినన్ని నిధులు కేటాయించి మిగులు పనులు పూర్తిచేయాలన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సయ్యద్ హనీఫ్, జిల్లా కమిటీ సభ్యులు వెంకటేశ్వర్లు, పీసీ కేశవరావు, కె.మాల్యాద్రి, టి.రంగారావు, డీకేఎం రఫీ, గుమ్మ బాలనాగయ్య, టి.ఆవులయ్య, బి.వెంకటేశ్వర్లు, డి.తిరుపతిరెడ్డి, షేక్ అన్వర్, పి.రూబెన్, కాశయ్య, జె.రాజు, వి.రాజ్యలక్ష్మి, డి.సారా, సీహెచ్ అంజయ్య, ఎస్‌కే నన్నేసా తదితరులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా గ్రీవెన్స్


సర్వే రిపోర్ట్ కోసం తిప్పుతున్నారని చెబుతున్న బాధితులు

బేస్తవారిపేట: స్థానిక రెవిన్యూ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక మొక్కుబడిగా సాగింది. తహసీల్దార్ సెలవులో ఉండగా ఆర్‌ఐ సలీం, ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హాజరయ్యారు. మిగిలిన శాఖలకు చెందిన కొందరు అధికారులు సమయపాలన పాటించకుండా సంతకాలు పెట్టుకుని వెళ్లిపోతున్నారు. కాగా గ్రీవెన్స్‌లో రెండు అర్జీలు వచ్చినట్లు ఆర్‌ఐ తెలిపారు.

సర్వే రిపోర్ట్ కోసం తిప్పుకుంటున్నారు

నెలన్నర క్రితం భూమి సర్వే చేసి రిపోర్ట్ ఇవ్వకుండా ఇదిగో అదిగో అని కార్యాలయం చుట్టూ తిప్పుకుంటున్నారని బేస్తవారిపేటకు చెందిన తుపాకుల కాశయ్య కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే శింగరపల్లెకు చెందిన దాసరి చిన్న వెంకటస్వామి తన వాటాకు వచ్చిన సర్వే నంబర్ 559లోని 1.70 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో తన అన్న పేరుపై నమోదు చేశారని, మూడు వారాల క్రితం సర్వే చేసినా రిపోర్ట్ ఇవ్వకుండా తిప్పుకుంటున్నారని వాపోయారు.

సమస్యలపై అర్జీల వెల్లువ


అర్జీని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం: తమ సమస్యలు పరిష్కరించాలంటూ సబ్ డివిజన్ పరిధిలోని పలువురు వ్యక్తులు సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గ్రీవెన్స్‌కు హాజరై అర్జీలు ఇచ్చారు. తన పొలాన్ని ఆన్‌లైన్ చేయాలని పలు దఫాలుగా అర్జీలు ఇచ్చినా అధికారులు స్పందించడం లేదని తర్లుపాడుకు చెందిన పి.లక్ష్మీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై తహసీల్దార్‌తో మాట్లాడిన సబ్‌కలెక్టర్ వెంటనే సమస్య పరిష్కరించాలని ఆదేశించారు. సబ్ డివిజన్ వ్యాప్తంగా 24 అర్జీలు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

వైఎస్సార్ సీపీ అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలు రమాదేవి మృతి


రమాదేవి(ఫైల్)

రాచర్ల: మండలంలోని యడవల్లి క్రాస్ రోడ్డు వద్ద కారు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన గిద్దలూరు పట్టణం 11వ వార్డు వైఎస్సార్ సీపీ నాయకురాలు, అంగన్‌వాడీ వింగ్ అధ్యక్షురాలు బెల్లం రమాదేవి కర్నూలులోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఈ నెల ఒకటో తేదీన విజయవాడలో గృహ ప్రవేశానికి హాజరై తిరుగు ప్రయాణంలో ఉండగా యడవల్లి క్రాస్ రోడ్డు వద్ద వీరి కారు ప్రమాదానికి గురైంది. ఈ సంఘటనలో బెల్లం చెన్నయ్య అక్కడికక్కడే మృతి చెందగా, కారులో వెనుక సీటులో కూర్చున్న ఆయన సతీమణి రమాదేవికి తీవ్ర గాయాలైన సంగతి తెలిసిందే. మెరుగైన వైద్యం కోసం కర్నూలు తరలించి చికిత్స అందిస్తుండగా పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మరణించారు. ఆమె మృతదేహాన్ని మంగళవారం ఉదయం గిద్దలూరు పట్టణానికి తీసుకొస్తున్నట్లు బంధువులు తెలిపారు. ఆమె మృతిపై వైఎస్సార్ సీపీ గిద్దలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పార్టీ కార్యక్రమాల్లో రమాదేవి క్రియాశీలకంగా వ్యవహరించేవారని, ఆమె మృతి పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు.

పేదలకు నివేశన స్థలాలివ్వాలి


ఆర్‌ఐకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ, రైతు సంఘ నాయకులు

బేస్తవారిపేట: పేదలందరికీ నివేశన స్థలాలు ఇస్తామని ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చాలని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి యు.జోసఫ్, నియోజకవర్గ రైతు సంఘ కార్యదర్శి డాకాల పుల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం బేస్తవారిపేట బస్టాండ్ నుంచి ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ సలీమ్‌కు వినతిపత్రం అందజేశారు. పట్టణ ప్రాంతాల్లో 2 సెంట్లు, పల్లెల్లో 3 సెంట్ల స్థలం ఇవ్వాలని, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. అసైన్‌మెంట్ కమిటీలను ఏర్పాటు చేసి, నిరుపేదలకు భూమి పంచాలన్నారు. అటవీ, బంజరు భూములను గిరిజనులకు కేటాయించాలని, రేషన్ బియ్యం గతంలో మాదిరిగానే ఇంటింటికీ సరఫరా చేయాలని, భూ ఆక్రమణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి యోగయ్య, సీపీఐ, రైతు సంఘ నాయకులు ఎం.వెంకట కొండయ్య, వి.శ్రీనివాసులు, నల్లబోతుల వెంకటేశ్వర్లు, జక్కా అంకయ్య పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు


వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ, ఎస్సై

కంభం: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా వ్యాపారులు సహకరించాలని కంభం సీఐ కె.మల్లికార్జున కోరారు. సోమవారం సాయంత్రం స్థానిక మార్కెట్ రోడ్, చౌక్ సెంటర్, కంభం బస్టాండ్‌లో వ్యాపారులకు ఎస్సై నరసింహారావుతో కలిసి కౌన్సెలింగ్ ఇచ్చారు. రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల వినియోగం, జనాభా పెరుగుదల నేపథ్యంలో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోందన్నారు. తోపుడు బండ్లు, హోటల్స్, వస్త్ర దుకాణాలు, కిరాణా షాపుల వారు తమ వస్తువులు రోడ్డుపైకి ఉంచవద్దని స్పష్టం చేశారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తీసుకుంటమని హెచ్చరించారు.

విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ

మార్కాపురం టౌన్: పట్టణంలోని పూలసుబ్బయ్య కాలనీలో ఉన్న మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులకు ప్రముఖ కథా రచయిత, కవి, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పిడుగు పాపిరెడ్డి జ్ఞాపకార్థం పుస్తకాలు, పెన్నులను సోమవారం పంపిణీ చేశారు. పాఠశాల హెచ్‌ఎం రవికుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులకు రూ.10 వేల విలువైన స్టేషనరీ అందించిన దాతలు రవీంద్రారెడ్డి, నరేంద్రరెడ్డిని అభినందించారు. విద్యార్థులు బాగా చదివి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన

మార్కాపురం: రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ ఆదేశాల మేరకు సోమవారం మార్కాపురం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్యానల్ లాయర్ రామయ్య అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి దివ్యాంగ చిన్నారుల వివరాలు, పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. సచివాలయ ఉద్యోగులు, అంగన్‌వాడీ సిబ్బందితో మాట్లాడి బాల్య వివాహాల నిరోధంపై చర్చించారు. న్యాయ సేవాధికార సంస్థ ద్వారా లభించే ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారా లీగల్ అసిస్టెంట్ ఎస్‌కే బాషా తదితరులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఉద్యోగుల రక్తదానం


రక్తదానం చేస్తున్న అటవీశాఖ ఉద్యోగులు

గిద్దలూరు రూరల్: పట్టణంలోని అటవీశాఖ కార్యాలయం ఆవరణలో సోమవారం డిప్యూటీ డైరెక్టర్ నిషాకుమారి ఆధ్వర్యంలో ఉద్యోగులు రక్తదానం చేశారు. రక్తదానంపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో అటవీశాఖ ఉద్యోగులు రక్తదానం చేసినట్లు డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు. రక్తదానంతో కలిగే ప్రయోజనాలను డీజీఆర్ వైద్యశాల చైర్మన్ డా.హరినాథరెడ్డి వివరించారు. కార్యక్రమంలో రేంజ్ ఆఫీసర్లు సత్యనారాయణరెడ్డి, మధుప్రియ, నీలకంఠేశ్వరరెడ్డి, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్లు రంగారెడ్డి, వంశీ, ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు పాల్గొన్నారు.

ముగిసిన శ్రీవారి బ్రహ్మోత్సవాలు


పూజల్లో పాల్గొన్న కమిటీ సభ్యులు

మార్కాపురం టౌన్: స్థానిక శ్రీలక్ష్మి పద్మావతి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి 18వ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజున స్వామి వారికి అర్చకులు సుప్రభాతసేవ, తోమాల, చతుర్వేద పారాయణం తదితర పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో అధ్యక్ష కార్యదర్శులు సీహెచ్ మాలకొండ నరసింహారావు, వి.రామకృష్ణారావు, ఆర్‌కేజీ నరసింహం, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్చకుడిపై దాడి హేయం


మాట్లాడుతున్న సంఘ నాయకులు

గిద్దలూరు రూరల్: హైదరాబాద్‌లోని చిలుకూరు బాలాజీ దేవాలయం ప్రధాన అర్చకుడు రంగరాజన్‌పై దాడి హేయమైన చర్య అని బ్రాహ్మణ సంఘ జిల్లా అధ్యక్షుడు ఇంద్రనీల్ పేర్కొన్నారు. స్థానిక బ్రాహ్మణ సంఘ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దాడికి పాల్పడిన నిందితులపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బ్రాహ్మణుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బ్రాహ్మణ సంఘ నాయకులు పాల్గొన్నారు.

మిరప, పుచ్చలో సస్యరక్షణ చర్యలు పాటించాలి

● దర్శి కేవీకే స్పెషలిస్టు టి.వెంకటేశ్వరరెడ్డి

పొదిలి రూరల్: మిరప, పుచ్చ పంటలు సాగు చేసే రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని దర్శి కేవీకే స్పెషలిస్టు టి.వెంకటేశ్వరరెడ్డి సూచించారు. సోమవారం పొదిలి మండలంలోని ఆముదాలపల్లి రైతు సేవా కేంద్రంలో పంటల సాగుపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ.. రైతులు సమగ్ర యాజమాన్య పద్ధతులు, తెగుళ్ల నివారణ, పురుగు మందుల వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. మిరపలో దోమ, తామర పురుగుల ఉధృతి ఎక్కువగా ఉందన్నారు. తెల్లదోమ నివారణకు స్పినెటోరామ్ లేదా ఫిప్రొనిల్ లేదా బ్రోఫ్లానిలైడ్ మందులు మార్చి పిచికారీ చేయాలన్నారు. రైతులు ఒక పురుగు మందు తరువాత కచ్చితంగా 19:19:19 లేదా నానో యూరియా 13:0:45 మరియు అగ్రోమాక్స్ రోజు మార్చి రోజు ఇవ్వాలని సూచించారు. పుచ్చలో లీఫ్ మైనర్ నివారణకు ఇమిడాక్లోప్రిడ్, ఫిప్రోనిల్ 2 మి.లీ మందును లీటరు నీటికి, ఆంత్రాక్నోజ్ తెగులు నివారణకు హెక్సాకొనజోల్ లేదా అజాక్సిస్ట్రోబిన్ లేదా టెబ్యుకొనజోల్, ట్రిఫ్లాక్సీస్ట్రోబిన్ 3 గ్రాముల మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. ఫార్మర్ చాట్ యాప్ గురించి హెచ్ఓ సంధ్య వివరించారు. అనంతరం తోటలను పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్ శిరిమల్లె శ్రీనివాసులు, పులి వెంకటేశ్వరరెడ్డి, నర్మద, రైతులు పాల్గొన్నారు.


తోటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తాం

● నిర్మమహేశ్వరస్వామి దేవస్థానం నూతన ఈఓ నారాయణరెడ్డి


ఈఓ నారాయణరెడ్డి

పొదిలి రూరల్: శివరాత్రి వేడుకలు వైభవంగా నిర్వహిస్తామని, భక్తులకు అసౌకర్యం కలగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటామని ఈఓ నర్రా నారాయణరెడ్డి పేర్కొన్నారు. పొదిలిలోని పార్వతీదేవి సమేత నిర్మమహేశ్వరస్వామి దేవస్థానం నూతన ఈఓగా సోమవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. ముందుగా శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. ఈ నెల 26వ తేదీన శివరాత్రి పండగకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఈ నెల 18 నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 27న రథోత్సవానికి వేలాది మంది భక్తులు హాజరుకానున్న నేపథ్యంలో పోలీసుల సహాయంతో ప్రత్యేక ఏర్పాట్లు చేయనున్నట్లు చెప్పారు. అనంతరం రథం అలంకరణలో భాగంగా మరమ్మతు పనులను ప్రారంభించారు. శివరాత్రి వేడుకల నిర్వహణకు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

గుర్తింపు కార్డు ఉంటేనే పథకాలు

పొదిలి రూరల్: రైతులు విశిష్ట గుర్తింపు సంఖ్య పొందితేనే ప్రభుత్వ పథకాలు అందుతాయని వ్యవసాయాధికారి ఎస్కే జైన్‌లాబ్దిన్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రైతు విశిష్ట గుర్తింపు కార్డుకు నేటి నుంచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఆధార్ కార్డు, ఆధార్ లింక్ ఫోన్ నెంబర్, పట్టాదారు పాసు పుస్తకం తీసుకెళ్లి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని స్పష్టం చేశారు. డిజిటల్ గుర్తింపు నెంబరు జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

రేపటి నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడులో పురాతనమైన రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నట్లు అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కరరావు, ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి పేర్కొన్నారు. అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. 13న కల్యాణోత్సవం, 14న సింహ వాహనం, 15న శేషవాహనం, 16న హనుమంత వాహనం, 17న గరుడోత్సవం, 18న గజవాహనంపై స్వామివారి నగరోత్సవం, 19న రథోత్సవం నిర్వహిస్తామని, 20న దోపు ఉత్సవం, 21న తీర్థావళి, నాగావళి, పూర్ణాహుతి, వసంతోత్సవంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వివరించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గరుడోత్సవం, రథోత్సవానికి పోలీసుల సహకారంతో ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు.